www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 9 అక్టోబర్ 2025



యానాదుల సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య

ప్రజాశక్తి - భీమవరం

మోగల్లు లో ఉన్న యానాదుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య డిమాండ్ చేశారు. పాలకోడేరు రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ ఎస్.వి.విజయలక్ష్మికి యానాదుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యానాదుల కుటుంబాలకు కనీసం ఆధార్ కార్డులు కూడా లేవని చెప్పారు. గతంలో జరిగిన అగ్ని ప్రమాదంలో స్థానికంగా నివాసముంటున్న రెండు కుటుంబాలకు చెందిన ఆధార్ కార్డులు అగ్నికి ఆహుతయ్యాయని, అప్పటి నుంచి ఆధార్ కార్డులు లేవని తెలిపారు. అర్హులైన కుటుంబాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని వీఆర్ఒకు ఆదేశాలు జారీ చేశారు.

ఉలికిపాటు..

- రాయవరం ఘటనతో రెండు జిల్లాల ప్రజల్లోనూ కలవరం
- గత ప్రమాదాలను గుర్తు తెచ్చుకున్న జనం

దీపావళి అంటే దీపాల పండుగ. దాని స్థానంలో బాణసంచా కాల్పుల మోత పెరగడంతో ఎక్కడికక్కడ బాణసంచా తయారీ కేంద్రాలు వెలిశాయి. ప్రతి సంవత్సరం దీపావళి పండుగకు రెండు నెలల ముందు నుంచి ఈ తయారీ కేంద్రాలు కూలీలతో కిటకిటలాడుతుంటాయి. ప్రమాదపు అంచున పని చేస్తున్నామని తెలిసినా వ్యవసాయ పనులు తగ్గడం, ఉపాధి లేకపోవడంతో అనివార్యంగా బాణసంచా తయారీ కేంద్రాల్లో పనులకు మహిళలు పెద్ద సంఖ్యలో వెళ్లడం సర్వసాధారణమైంది. ఈ క్రమంలో అక్కడ చోటుచేసుకుంటున్న ప్రమాదాల్లో పెద్దసంఖ్యలో కూలీలు మృతి చెందడం అందరిని కలిచివేస్తోంది. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బుధవారం చోటుచేసుకున్న ప్రమాదం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లావాసులను ఉలికిపాటుకు గురి చేసింది. ఈ ఘటనతో జిల్లాలో అధికారులు బాణసంచా తయారీ కేంద్రాల్లో తనిఖీలు ప్రారంభించారు. అయితే ఇది తూతూమంత్రపు చర్యగా ఉంటే జిల్లాలోనూ రాయవరం వంటి ఘటనలు చోటుచేసుకునే ప్రమాదం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో రెండు జిల్లాల్లో గతంలో చోటుచేసుకున్న ఘటనలు జిల్లా వాసుల కళ్లముందు కదలాడాయి. ఆ వివరాలు ఘటనలవారీగా..



ఏడు కుటుంబాలపై పిడుగు.. ★★★

తణుకు: తెల్లవారితే దీపావళి. 2024 అక్టోబర్ 30వ తేదీ. ఆ బాణసంచా తయారీ కేంద్రంలో పని చేసే మహిళలు త్వరగా పని ముగించుకుని ఇంటికి వెళ్లాలనే ఆలోచనలో ఉన్నారు. అదే సమయంలో తాము పనిచేసే తయారీ కేంద్రానికి ఆనుకుని ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగులు పడటం, ఆ నిప్పురవ్వలు తయారీ కేంద్రంపై పడి బాణసంచాకు నిప్పంటుకోవడం క్షణాల్లో జరిగిపోయింది. దీంతో భారీ పేలుడుతో ఉవ్వెత్తున మంటలు ఎగసిపడ్డాయి. అక్కడ పని చేసేవారు అక్కడి నుంచి బయటపడే ప్రయత్నంలోనే ఇద్దరు అక్కడికక్కడే సజీవ దహనమయ్యారు. మరో ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. మరో పది మంది స్వల్ప గాయాలపాలయ్యారు. తీవ్రంగా గాయపడిన ఐదుగురు కొద్దిరోజులకే పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పయారు. ఈ ఘటన దువ్వకు సమీపంలోని తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం శివార్లలో చోటుచేసుకున్నా మృతులంతా పశ్చిమగోదావరి జిల్లాలోని తణుకు మండలం దువ్వ, పెంటపాడు మండలం రావిపాడు గ్రామాలవాసులే. అంతకుముందు సంవత్సరం ఈ తయారీ కేంద్రాన్ని దువ్వలోనే అదే గ్రామానికి చెందిన వేగిరోతు శివ నిర్వహిస్తుండగా అధికారులు లైసెన్స్ రెన్యువల్ చేయలేదు. దీంతో తూర్పుగోదావరి జిల్లా పరిధిలో అనుమతులు తెచ్చుకుని సూర్యారావుపాలెంలో తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో దువ్వ, రావిపాడు గ్రామాల మహిళలు అక్కడ పనికెళ్లి మృత్యువాత పడ్డారు.

ఘటనలెన్నో.. పర్యవేక్షణ మాత్రం శూన్యం

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో బాణసంచా పేలి ప్రాణాలు కోల్పోవడం, గాయపడిన ఘటనలు అనేకం ఉన్నాయి. కొత్తోట పంచాయతీలో సుమారు ఆరేళ్ల కిందట షెడ్డులో భద్రపరిచిన బాణసంచా సామగ్రికి ప్రమాదవశాత్తూ నిప్పంటుకుని భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో అక్కడే ఉన్న ఆ షెడ్డు యజమానులు గాయాల పాలయ్యారు. సుమారు ఐదేళ్ల క్రితం పేరుపాలెం నార్త్‌లో యువతి టపాకాయలు కడుతుండగా ప్రమాదవశాత్తూ నిప్పంటుకుని అక్కడే ఉన్న బాణసంచాకు నిప్పంటుకుని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఆ యువతి గాయాల పాలై కోలుకోగా, ఆ సమయంలో అక్కడే ఉన్న మూడేళ్ల చిన్నారి తీవ్ర గాయాలపాలైంది. కుటుంబ సభ్యులు ఆమెను భీమవరంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది.

బాణసంచా తయారీకి దూరమైన పెదవెల్లమిల్లి.. ★★★

ఉంగుటూరు: ఇప్పటికి సుమారు 15 ఏళ్లుగా ఆ గ్రామంలో బాణసంచా అంటే హడలిపోతారంటే అతిశయోక్తి కాదు. 2010 ఆగస్టు పదో తేదీన చోటుచేసుకున్న దారుణ ఘటన పెదవెల్లమిల్లివాసుల కళ్ల ముందు కదులాడుతుంది. మండలంలోని పెదవెల్లమిల్లిలో బాణసంచా తయారీ కేంద్రంలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో ఎనిమిది మంది సజీవదహనమయ్యారు. దీపావళి టపాసుల తయారీని ఆ గ్రామంలో కుటీర పరిశ్రమగా చాలాకాలం నుండి అనధికారికంగా నిర్వహిస్తున్నారు. ఎప్పటిలానే 2010 ఆగస్టు పదో తేదీన పట్టపగలు సుమారు వంద కేజీల మందు తెచ్చి వాటిని టపాసులు కట్టే మహిళలకు ఇచ్చేందుకు నాపరాయి నేలపై పెట్టి ఇనుప కుంచంతో కొలుస్తుండగా అది నాపరాయికి తగిలి బాణాసంచా మందు విస్ఫోటనంతో ఐదుగురు అక్కడికక్కడే సజీవ దహనమయ్యారు. ఆ పేలుడు తాకిడికి మరో ముగ్గురు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందారు. భారీ విస్ఫోటనం కారణంగా నాలుగు నివాస గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. దీనిపై అప్పటి చేబ్రోలు ఎస్ఐ సుబ్బారావు, ఇతర అధికారులుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. నాటి నుంచి నేటి వరకూ ఆ గ్రామంలో టపాసుల తయారీ అనే మాట విన్పించడం లేదు.

కడియద్దలో కాళరాత్రి.. ★★★

తాడేపల్లిగూడెం: 2022 నవంబర్ 10వ తేదీ రాత్రి కడియద్ద గ్రామస్తులకు కాళరాత్రిగా మిగిలిపోయింది. ఆ గ్రామంలో బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన చోటుచేసుకున్న ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో తీవ్ర గాయాలతో తర్వాత మరణించారు. అన్నవరం అనే వ్యక్తికి సంబంధించిన బాణసంచా తయారీ కేంద్రంలో పరిమితికి మించి నిల్వలు ఉండటం, ఆ సామగ్రిని అక్కడి నుంచి తరలిచే ప్రయత్నంలో విస్ఫోటనం సంభవించి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాలకు విన్పించేలా పేలుడు శబ్దాలు, ప్రకంపనలు చోటుచేసుకున్నాయంటే ప్రమాద తీవ్రత అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన నలుగురు వలస కూలీలే కావడం గమనార్హం.

రక్షణ చర్యలు అరకొరే..!.. ★★★

పెనుమంట్ర: మండలంలోని దీపావళి మందుగుండు సామగ్రి తయారీ కేంద్రాలు లేవుగాని, హోల్‌సేల్ దుకాణాలు ఎక్కువగానే ఉన్నాయి. అయితే వాటిలో భద్రతా చర్యలు అంతంతమాత్రమేననే ఆరోపణలు విన్పిస్తున్నాయి. మార్టేరు నుండి వెలగలేరు వెళ్లే రోడ్డులో ఒక బాణసంచా హోల్‌సేల్ దుకాణం ఇంచుమించు జనావాసాలకు దగ్గరగా ఉంది. ఈ షాప్ పక్కనే ఉన్న రోడ్డు గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆలమూరు వద్ద ఉన్న బాణసంచా హోల్‌సేల్ దుకాణానికి కూతవేటు దూరంలో పెట్రోల్ బంక్ ఉంది. గత సంవత్సరం ఈ దుకాణంలోనే వెల్డింగ్ పనులు చేస్తున్న సమయంలో నిప్పురవ్వలు ఎగసిపడి బాణసంచా పేలుడు చోటుచేసుకుంది. ఆ సమయంలో అక్కడ జనం పెద్దగా లేకపోవడంతో ప్రాణనష్టం సంభవించలేదు. ఈ పరిస్థితుల్లో అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

బాణసంచా తయారీ కేంద్రాల్లేవు.. గొడౌన్లే ఉన్నాయి

పి.శ్రీనివాస్, ఏలూరు జిల్లా అగ్నిమాపక అధికారి

ఏలూరు జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రాలు లేవు. గొడౌన్లు మాత్రమే ఉన్నాయి. నూజివీడులో రెండు, కైకలూరులో ఒకటి, భీమడోలులో ఒకటి, ఏలూరు పరిసర ప్రాంతాల్లో రెండు ఉన్నాయి. ఇవన్నీ జనావాసాలకు దూరంగా ఊరి బయట ఉన్నాయి. ఈ గొడౌన్లు నిర్వహించే వారంతా కేంద్ర ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొంది ఉన్నారు. నీటి పంపులు, నీటి స్టోరేజీ, అగ్నిమాపక నిబంధనలతోపాటు అన్ని జాగ్రత్తలూ గొడౌన్లలో తీసుకోవడం జరుగుతుంది. ఇప్పటికే అన్నీ ఒకసారి పరిశీలించాం. రెండు రోజుల్లో మరోసారి తనిఖీ చేస్తాం.

ఆక్వా సాగుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

వారం రోజుల్లో చేసుకోకపోతే జరిమానా - జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని ఆక్వా చెరువుల సాగుదారులు తప్పనిసరిగా అప్సడ (ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ) కింద నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 50 వేల ఎకరాల ఆక్వా చెరువులను అప్సడ కింద నమోదు చేసుకున్నారని, ఇంకా సుమారు 83 వేల ఎకరాల వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉందని తెలిపారు. 'అప్సడ'లో రిజిస్టరైన వారు మాత్రమే విద్యుత్ సబ్సిడీ, ఇతర ప్రభుత్వ రాయితీలను పొందగలరని అన్నారు. ఆక్వా ఉత్పత్తుల ఎగుమతికి కూడా అప్సడ లైసెన్స్ తప్పనిసరని తెలిపారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఆక్వా చెరువుల రిజిస్ట్రేషన్లు ఒక నెలలోపు పూర్తి చేయాలని ఆదేశించారని, ఇప్పటికే 20 రోజులు గడువు ముగిసిందని చెప్పారు. అప్సడ రిజిస్ట్రేషన్ లేకుండా ఆక్వా ఉత్పత్తులు సాగు చేస్తే వారికి పెద్ద మొత్తంలో అపరాధ రుసుం విధిస్తామని తెలిపారు. రానున్న వారం రోజుల్లోపు ఆక్వా రైతులు విధిగా అప్సడ రిజిస్ట్రేషన్లను పూర్తి చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకునే రైతు ఎకరానికి ఒక వెయ్యి రూపాయలు రుసుం చెల్లించాల్సి ఉంటుందని, ఎఫ్ఎంబి, పట్టాదారు పాస్‌బుక్, ఆర్ఒఆర్, అడంగల్, ఆధార్ కార్డ్, లైవ్ ఆటోకాడ్, లీజ్ హోల్డర్ అయితే లీజు అగ్రిమెంటును సంబంధిత సచివాలయాల్లో అందజేసి డిజిటల్ అసిస్టెంట్ ద్వారా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అప్సడ రిజిస్ట్రేషన్‌ను వెంటనే పూర్తి చేసుకొని ప్రభుత్వ రాయితీలు పొందాలని సూచించారు.

రేపు, ఎల్లుండి నిట్‌లో టెక్రియా 2కె25



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నిట్ యాజమాన్యం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపి నిట్)లో ఈ నెల 10, 11వ తేదీల్లో రెండు రోజులపాటు నిర్వహించనున్న టెక్రియా 2కె25 కార్యక్రమాల్లో భాగంగా బుధవారం రాత్రి ప్రాంగణంలోని గ్రంథాలయం వద్ద ఏర్పాటు చేసిన కర్టెన్‌రైజర్ కార్యక్రమాన్ని రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో వైజ్ఞానిక స్పృహను పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేస్తూ సమాజహిత పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు.

టెక్రియా కార్యక్రమాలు

ఈ నెల 10, 11న నిర్వహించనున్న టెక్రియా కార్యక్రమాలు రోబోటిక్స్, ఆటోమేషన్, అల్టిమేట్ డ్రోన్, డ్రోన్ ఛాలెంజ్, సెరెనిటీ రూమ్, ఇంజినీర్స్ డ్రైవ్ వే, రిథమ్ రియాల్టీ, షేర్ లాక్డ్, షార్ట్ ఫిలిం, గైరో మేజ్ ఛాలెంజ్, డిస్ఎక్స్ట్రీమ్, టెక్ ఎక్స్పో, ఎరిస్, మెటీరియల్ మైండ్స్ పోస్టర్ షో కేస్, కాస్ ఏ థాన్, డ్రోన్ వర్క్‌షాప్, హోవర్ నోవ, నేచర్ హంట్, బింగో బ్లోసమ్, కెరీర్ గ్యాలరీ, షూట్ ద వరల్డ్, టిక్ ఆర్కేడ్, విజనరీ, ఎఫ్ 1 ద రేస్, స్టార్ట్ అప్ ఎస్కేప్ రూమ్, ఇన్నోవేషన్ ఎక్సహిబిట్, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.హిమబిందు, డాక్టర్ శ్రీనివాసన్, డాక్టర్ పి.రమేష్ పాల్గొన్నారు.

బాణసంచా గొడౌన్లకు సీళ్లు



బాణసంచా తయారీ కేంద్రానికి తాళాలు వేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - నరసాపురం

బాణాసంచా తయారీకి అనుమతులు లేవని, ఎవరన్నా బాణాసంచా తయారు చేస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ఐవివి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని బాణసంచా గొడౌన్లను బుధవారం ఆయన ఫైరాఫీసర్ కె.భాస్కర్ రామంతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. లైసెన్స్ రెన్యువల్, నిల్వ సరుకులపై ఆరా తీశారు. లక్ష్మణేశ్వరంలో స్టాక్‌ను పరిశీలించారు. ప్రమాదాలు జరుగుతున్నందున తదుపరి అదేశాలు వచ్చే వరకు గొడౌన్ మూసివేయాలని ఆదేశించారు. అనంతరం రెండు గొడౌన్లకు అధికారులు సీలు వేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ టి.పాపారావు, విఆర్ఒ కె.భారతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడే నిదర్శనం

వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన నిరసన



భీమవరంలో నిరసన తెలియజేస్తున్న వామపక్షాల నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్.గవాయిపై జరిగిన దాడే దానికి నిదర్శనమని సిపిఎం, సిపిఐ, ఫార్వర్డ్ బ్లాక్, ఎంసిపిఐ(యు), ప్రజాసంఘాల నేతలు అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంపైనా, ప్రజాస్వామ్యంపై దాడికి పాల్పడిన న్యాయవాది రాకేష్ కిషోర్‌ను, అతన్ని పురికొల్పిన మతోన్మాద శక్తులను చట్టబద్ధంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దాడిని ఖండిస్తూ మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ సిజెఐపై దాడి ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని, పాలకుల ప్రేరణతోనే ఇది జరిగిందని విమర్శించారు. హేతువాదులు, కవులు, రచయితలు, మేధావులు, అభ్యుదయ, ప్రగతిశీలవాదులపై పదకొండేళ్లుగా దమనకాండ జరుగుతుందని గుర్తు చేశారు. ఈ ఘటనను సిజెఐ హుందాగా క్షమించినా, దేశ ప్రజలు క్షమించరని అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ చెప్పులు, బూట్లతో అవమానించడం సనాతన ధర్మంలో నిత్యకృత్యంగా మారిందన్నారు. సిజెఐపై బూటు విసిరి మరోసారి సనాతన వాదులు మొత్తం దళితులను అవమానించారన్నారు. దీనిపై మోడీ ట్వీట్ చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఎంసిపిఐ(యు) జిల్లా నాయకులు కె.మహంకాళి, ఫార్వర్డ్ బ్లాక్ డివిజన్ కార్యదర్శి దండు శ్రీనివాసరాజు మాట్లాడుతూ సిజెఐపై దాడికి రాకేష్‌కు అంత ధైర్యం ఎలా వచ్చిందని, దీని వెనుక ఎవరున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల, సంఘాల నేతలు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, మల్లుల శ్రీనివాసరావు, వైవి.ఆనంద్, నాగిడి శాంతమూర్తి, ఖాన్‌భాషా, బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు, డి.త్రిమూర్తులు, ఎం.ఆంజనేయులు, నడింపల్లి హరనాథరాజు, యాక్షన్ ఫర్ పీపుల్స్ ప్రోగ్రెస్ రాష్ట్ర కన్వీనర్ ఎన్.కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



చించినాడలో నిరసన తెలుపున్న సిపిఎం నేతలు

యలమంచిలి: సుప్రీంకోర్టు సిజెఐపై దాడిని ఖండిస్తూ బుధవారం చించినాడలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు దేవ సుధాకర్, సరిపల్లి జయప్రభ, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, ముస్కూడి జయశ్రీ, శెట్టిమి నాగమణి, మురాల రాజేష్, గొల్ల పెద్దిరాజు, ముస్కూడి విజయ్ కుమార్, ఆకుమర్తి పద్మరాజు, శెట్టిమి గోపాలకృష్ణ, సత్యవతి, మరియమ్మ, సరోజినీ తదితరులు పాల్గొన్నారు.



గణపవరంలో..

గణపవరం: సిజెఐపై దాడిని ఖండిస్తూ కెవిపిఎస్ ఆధ్వర్యాన వరదరాజపురం అంబేద్కర్ విగ్రహం సెంటర్లో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిననాగేశ్వరరావు, అంబేద్కర్ ఇండియన్ మండల కోఆర్డినేటర్ బళ్లారపు అశోక్, వరదరాజపురం సర్పంచి గుర్రం సుబ్బారావు మాట్లాడుతూ న్యాయమూర్తిపై దాడి చేసిన వారిని దేశద్రోహిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కట్టురి ప్రసాద్, కుసుమే రాజు, మెగసాల శ్రీను, అద్దంకి రాజేందర్, ఎరిచర్ల కుమార్, మదాసి చినబాబు, అలిపే మాణిక్యాలరావు, సిద్రా నవీన్, అబ్రహం, మణి, నాని పాల్గొన్నారు.



పాలకొల్లులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

టిడ్కో లబ్ధిదారులను మోసగించిన జగన్

పట్టణంలో అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

జగన్ టిడ్కో ఇళ్ల లబ్ధిదారులను రుణగ్రస్తులను చేసి నిలువునా మోసగించారని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులో రూ.కోట్ల వ్యయంతో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను కూటమి నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవనం, గౌడ, శెట్టిబలిజ భవనం, ముస్లిం షాదీఖానా, టిడ్కో ఇళ్లు, వంతెన, ప్రభుత్వాసుపత్రి భవనం, పార్కులు, ఎన్‌టిఆర్ కళాక్షేత్రాల్లో జరుగుతున్న పనుల పురోగతిని స్వయంగా పరిశీలించారు. పనులకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు విలేకరులతో మాట్లాడుతూ టిడ్కో ఇళ్లకు సంబంధించి మిగిలిన లబ్ధిదారులకు ఇళ్ల పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, పూర్తవగానే అప్పగిస్తామని చెప్పారు. టిడిపి ప్రభుత్వంలో 50 పడకల ప్రభుత్వాసుపత్రిని వంద పడకల స్థాయికి పెంచి ఆసుపత్రి భవనానికి రూ.12.60 కోట్లు నిధులు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పట్టణంలో అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజు, మున్సిపల్ కమిషనర్ విజయసారధి వెంకటేశ్వరరావు, మహ్మద్ జానీ, ధనాని సూర్యప్రకాష్, అవినాష్, పొట్నూరు శ్రీనివాస్, మల్లంపల్లి ఫకీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సంపద యోజనను వినియోగించుకోవాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పిఎం మత్స్య సంపద యోజన పథకానికి విరివిగా దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ నాగరాణి అధ్యక్షతన పిఎంఎంఎస్‌వై అమలుపై జిల్లా స్థాయి సమావేశాన్ని సంబంధిత కమిటీ సభ్యులతో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ పిఎం మత్స్య సంపద యోజన ద్వారా వివిధ సబ్సిడీ రుణాలను పొంది లబ్ధిదారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ పథకం ద్వారా రుణాన్ని పొందే జనరల్ కేటగిరీ లబ్ధిదారులు 50 శాతం బ్యాంకు రుణం, 40 శాతం సబ్సిడీ, 10 శాతం లబ్ధిదారుడు వాటాగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారులు 30 శాతం బ్యాంకు రుణం, 60 శాతం సబ్సిడీ, 10 శాతం లబ్ధిదారుల వాటాగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. 12 పథకాలకు సంబంధించి అందిన 110 దరఖాస్తుల్లో, పది పథకాలకు సంబంధించి 100 దరఖాస్తులను ఆమోదించడం జరిగిందన్నారు. వీటిలో సీవీడ్ కల్చర్ సాగుకు యూనిట్ ధర రూ.15 వేలు కాగా వెయ్యి యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, 42 మంది దరఖాస్తు చేసుకోగా మంజూరు చేశామని తెలిపారు. ఐస్ బాక్స్‌తో మోటార్ సైకిళ్ల యూనిట్ ధర రూ.75 వేలు కాగా 6 యూనిట్లు అందుబాటులో ఉండగా 17 దరఖాస్తులు అందాయని, అర్హత కలిగిన ఆరుగురికి మంజూరు చేశామని తెలిపారు. చేపల అమ్మకం కోసం ఇ-రిక్షాలు సహా ఐస్ బాక్స్‌తో కూడిన మూడు చక్రాల వాహనం యూనిట్ ధర రూ.3 లక్షలు కాగా 16 యూనిట్లు అందుబాటులో ఉన్నాయని అందిన ఐదు దరఖాస్తులకు మంజూరు చేసినట్లు తెలిపారు. సాంప్రదాయ మత్స్యకారులకు పడవలు, వలలు యూనిట్ ధర రూ.5 లక్షలు కాగా 80 యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, దరఖాస్తు చేస్తున్న 13 మందికి మంజూరు చేశామని తెలిపారు. ఇన్సులేటెడ్ వాహనాలు యూనిట్ ధర రూ.20 లక్షలు కాగా 4 యూనిట్లు అందుబాటులో ఉన్నాయని వచ్చిన దరఖాస్తుల్లో నాలుగు దరఖాస్తులను ఆమోదించడం జరిగిందన్నారు. ఫిష్ వాల్యూ యాడ్ ఎంటర్‌ప్రైజెస్ యూనిట్ ధర రూ.50 లక్షలు కాగా నాలుగు యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, అందిన ఒక్క దరఖాస్తును ఆమోదించడం జరిగిందన్నారు. సమావేశంలో రాష్ట్ర మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్, అప్సడా జిల్లా నోడల్ అధికారి పి.సురేష్, జిల్లా మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు ఎ.నాగరాజు, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, ఫిషరీష్ ఎడిలు, ఎఫ్‌డిఒలు, ఆక్వా రైతుల ప్రతినిధి వాతాడి కనకరాజు పాల్గొన్నారు.

కాళ్లలో భారీ వర్షం

రహదారులు జలమయం - స్తంభించిన జనజీవనం

ప్రజాశక్తి - కాళ్ల

మండల కేంద్రమైన కాళ్లలో బుధవారం కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు సైతం కాలవలను తలపించాయి. ఉదయం నుంచి తీవ్ర ఎండ కాచి సాయంత్ర సమయంలో ఒక్కసారిగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షం కురిసింది. రహదారులపై వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు గ్రామానికి చెందిన మంతెన అరుణకు వైద్య ఖర్చులకు దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకటరామరాజు బుధవారం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే కాళ్లకూరులో క్రైస్తవ శ్మశానవాటికలో పచ్చగడ్డి ఎక్కువగా పెరిగిపోయింది. దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ దాట్ల వెంకట రామరాజు గడ్డి మందు స్ప్రే చేసినందుకు 3,500 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

బాణసంచా నిల్వలు ఉంటే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి - మొగల్తూరు

అనుమతి లేకుండా బాణసంచా నిల్వలు, విక్రయాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ జి.వాసు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేటాయించిన స్థలంలో అనుమతి పొంది విక్రయాలు చేయాలని ఆయన సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కుర్చీలు అందజేస్తున్న దాత పాండురంగారావు

పాఠశాలకు కుర్చీలు అందజేత

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెంనార్త్ పంచాయతీ అంగజాలపాలెం ప్రాథమిక పాఠశాలకు దాత కుర్చీలు, విద్యా సామగ్రి బుధవారం అందజేశారు. గ్రామానికి చెందిన చవాకుల పాండురంగారావు మనవడు ప్రణయ్ పుట్టిన రోజును పురస్కరించుకుని కుర్చీలు, ఇతర సామగ్రిని పాఠశాల సిబ్బందికి అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని ఎం.కృష్ణవేణి, యూనియన్ బ్యాంకు మేనేజరు రాజశేఖర్, ఎస్ఎంసి ఛైర్మన్ నల్లి దేశాలమ్మ, చవాకుల సత్యనారాయణ పాల్గొన్నారు.



డిపిఒను అభినందిస్తున్న ఎంపిడిఒ కృష్ణమోహన్ తదితరులు

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

జిల్లా పంచాయతీ అధికారి రామ్నాథ్ రెడ్డి

ప్రజాశక్తి - ఆచంట

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి గ్రామాలను అభివృద్ధి పర్చాలని జిల్లా పంచాయతీ అధికారి రామ్నాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ మండలంలో 12 గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణ, సంపద కేంద్రాలు, వర్మీ కంపోస్టు తయారీ వంటి వాటిపై కార్యదర్శులు శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. పన్ను వేయని ఇళ్లను గుర్తించి పన్ను విధించి సకాలంలో వసూలు చేసి పంచాయతీల ఆదాయం పెంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ బి.కృష్ణమోహన్, పంచాయతీ కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

నియోజకవర్గ అభివృద్ధికి కలిసి కృషి చేద్దాం

ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాజకీయాలను పక్కనపెట్టి కూటమి నాయకులంతా కలిసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. పెంటపాడులో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులంతా తనకు సమానమేనని పార్టీలకు అతీతంగా అభివృద్ధిని సాధించడమే తన లక్ష్యమని తెలిపారు. వైసిపి ప్రభుత్వం గత ఐదేళ్లుగా అభివృద్ధిని గాలికొదిలేయడంతో ప్రజల అనేక అవస్థలు పడ్డారన్నారు. ముఖ్యంగా ఎస్‌సి సెల్ సబ్ ప్లాన్ నిధులను కూడా వేరే కార్యక్రమాలకు మళ్లించి వారికి అన్యాయం చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పంచాయతీలను అభివృద్ధి బాట పట్టించామన్నారు. ఎస్‌సి కాలనీలో కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టామన్నారు. పెంటపాడు లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సర్పంచి తాడేపల్లి సూర్య కళ, తాడేపల్లి ఈశ్వరరావు, తాడేపల్లి వంశీ కుటుంబం రూ.10 లక్షలు విరాళం ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ నిర్మాణానికి ఎంపీ నిధులు రూ.25 లక్షలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి తాడేపల్లి సూర్యకళ, ముదునూరు సొసైటీ ఛైర్మన్ దాసరి అప్పన్న, కూటమి నాయకులు కిలపర్తి వెంకట్రావు, కసిరెడ్డి మధులత పాల్గొన్నారు.

సూపర్ జిఎస్‌టి, సేవింగ్స్ కార్యక్రమం

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 13, 14, 16 వార్డుల్లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పంజా సెంటర్ పరిసర ప్రాంతాల్లోని మెడికల్ షాపులు, విక్టరీ సూపర్ మార్కెట్, మాటన్, చికెన్ షాపులు, హాట్ చిప్స్ వంటి స్థానిక వ్యాపార కేంద్రాలను సందర్శించారు. గత ప్రభుత్వ కాలంలో ఉన్న వస్తువుల ధరలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిఎస్‌టి 2.0 అమలు తర్వాత లభిస్తున్న ధరలతో పోల్చి ప్రజలకు వివరించారు. రామరాజు మాట్లాడుతూ కొత్త జిఎస్‌టి విధానం అమలుతో నిత్యావసర సరుకుల ధరలు గణనీయంగా తగ్గి, సాధారణ ప్రజల జీవనంలో ఊరట కలుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, సొసైటీ బ్యాంక్ అధ్యక్షులు అధికారి అనంత రామారావు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ పొన్నాల నాగబాబు, అందే రామకృష్ణ, షేక్ యూనిస్ బేగం, షేక్ హుస్సేన్, మౌలాలి ఖాన్, అక్తర్, షేక్ బాజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామరాజు

అధ్వానంగా ఉండి-కోపల్లె రహదారి

రూ.30 లక్షలతో మరమ్మతులు

నాణ్యతా లోపం

ఆరు నెలల్లోనే యథాస్థితికి రోడ్డు



గోతులతో అధ్వానంగా ఉన్న ఉండి, కోపల్లె రోడ్డు

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని ఉండి, కాళ్ల మండలం కోపల్లె గ్రామాలను కలుపుతున్న అంతర్గత రహదారి పూర్తిగా అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంక్రాంతి నాటికి రోడ్లకు మరమ్మతులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు హడావుడీగా మరమ్మతులు పూర్తిచేశారు. సుమారు 30 లక్షల రూపాయల వ్యయంతో ఉండి, కోపల్లె రహదారికి మరమ్మతులు చేయగా ఆరు నెలల కాలంలోనే పూర్తిగా అధ్వాన స్థితికి చేరడంతో పలువురు విమర్శిస్తున్నారు. గత జనవరిలో నాటి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్ నరసింహరాజు సుమారు కోటి రూపాయలతో రహదారిని పూర్తి చేసేందుకు శంకుస్థాపన చేయగా, ఎన్నికల కోడ్ వల్ల ఆ పనులు నిలిచిపోయాయి. తర్వాత కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా సంక్రాంతి నాటికి రహదారులన్నీ మరమ్మతులు పూర్తి చేసుకుని ప్రజలకు అందుబాటులోకి రావాలని కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించారు. దీంట్లో భాగంగా 30 లక్షల రూపాయలతో ఉండి, కోపల్లె రహదారికి మరమ్మతులు చేశారు. అయితే నాణ్యత లోపంతో ఆరు నెలల వ్యవధిలోనే తిరిగి అధ్వానంగా మారడంతో ప్రజల సొమ్ము బూడిదలో పోసిన పన్నీరు అయ్యిందని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. దీనిపై రోడ్లు, భవనాల శాఖ ఎఇ శ్రీహరి రాజును వివరణ కోరగా ఉండి, కోపల్లె రహదారిలో పలు పరిశ్రమలు ఉండడంతో పరిమితికి మించి లోడుతో లారీలు రాకపోకలు సాగించడంతో రహదారి కుంగిపోతోందని, ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా రహదారి పూర్వస్థితికి చేరుకుంటోందని తెలిపారు. ఒక పక్క బొండాడ డ్రెయిన్ ఉండడంతో రోడ్డు దిగిపోతోందని బొండాడ మురుగు కాలువకు రిటర్నింగ్ వాల్ కట్టాల్సిన పరిస్థితి ఉందని, ఆ విధంగా చేస్తేనే రహదారి బలంగా ఉంటుందని, సమస్యను శాసనసభ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని వివరించారు.

అభివృద్ధి పనులకు రఘురామకృష్ణరాజు శంకుస్థాపనలు

ప్రజాశక్తి - ఉండి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న రఘురామ కృష్ణరాజు

ఉండి శివారు పులిగుమ్మ, పాములపర్రు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పలు అభివృద్ధి పనుల్లో డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు పాల్గొన్నారు. పులిగుమ్మలో రూ.41 లక్షల వ్యయంతో జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా నిర్మించే 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్‌కు ఆయన ఉండి గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని దాత బుద్ధరాజు శ్రీరామరాజు తన తండ్రి దుర్గరాజు పేరిట లక్షల విలువ చేసే మూడు సెంట్ల స్థలాన్ని ఇవ్వడం అభినందనీయమన్నారు. పాములపర్రులో గ్రామస్తుల సహకారంతో రూ.ఏడు లక్షలతో ప్రక్షాళన చేయించిన తాగునీటి చెరువు, రెండు రేవులను, కెనరా బ్యాంక్ సౌజన్యంతో 5 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన మైక్రో వాటర్ ఫిల్టర్‌ను, ఎన్ఆర్ఇజిఎస్ గ్రామ పంచాయతీల సంయుక్త సహకారంతో రూ.ఏడు లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను సర్పంచి కేసన శాంతి కుమారి బలుసులరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, ఎఎంసి వైస్ ఛైర్మన్ యడవిల్లి వెంకటేశ్వరరావు, గ్రామ అధ్యక్షులు తోటరాముతో ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి శాంతి కుమారి మాట్లాడుతూ సుమారు 25 సంవత్సరాల నుంచి తమ గ్రామానికి సాగు తాగునీరొచ్చే పంట కాలువలో సుమారు 80 ఇళ్లకు చెందిన వారు తమ మరుగుదొడ్ల పైపులను పంట కాలువలోకి వదిలేయడంతో గ్రామస్తులు అనారోగ్యాల బారిన పడుతూ తీవ్ర ఇబ్బందులకు గురైనట్లు తెలిపారు. సమస్యను ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లగానే స్పందించి సమస్య పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారని, నేడు స్వచ్ఛమైన శుద్ధ జలాలను తమ గ్రామానికి అందించిన రఘురామ కృష్ణరాజుకు ప్రజలందరి తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ ప్రభుత్వంపై ఆధారపడకుండా సొంత నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు. సుమారు 25 కోట్ల రూపాయలతో పాములపర్రు నుంచి పెదకాపవరం వెళ్లే రహదారి నిర్మాణం అతి త్వరలోనే ప్రారంభమవుతుందని, ఉండి, గణపవరం రహదారి పరిస్థితి సైతం ఆర్అండ్‌బి శాఖా మంత్రితో మాట్లాడి 70 శాతం మరమ్మతులు, 30 శాతం పునర్నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకున్నామని ఆ పనులు కూడా అతి త్వరలోనే ప్రారంభమవుతాయని వివరించారు. ఉండి రైల్వే గేట్ పైన నిర్మించే ఆర్ఒబి నిర్మాణం మరో ఐదు నెలల్లో పూర్తయి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, మండల ఉపాధ్యక్షులు వర్రే సముద్ర మూర్తి, పాములపర్రు ఉపసర్పంచి వర్రే పెద రాఘవులు, క్లస్టర్ ఇన్‌ఛార్జి గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.



రాధామణిని సత్కరిస్తున్న ఎంఎల్‌సి గోపీమూర్తి ఉపాధ్యాయులు

రాధామణికి ఘన సత్కారం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అనాకోడేరు డిఎన్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయిని బి.రాధామణి ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం ఆమెను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.సూర్య భగవాన్‌రాజు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ రాధామణి విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. భీమవరం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఎన్.రమేష్ మాట్లాడుతూ 36 సంవత్సరాల సర్వీసులో ఎంతోమంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు, పాఠశాల యాజమాన్య కమిటీ, గ్రామస్తులు రాధామణి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎండిఎం కోఆర్డినేటర్స్ కె.కృష్ణారావు, జి.చిన్నయ్య, పాఠశాల ప్రథమ సహాయకులు రేపాక వెంకన్న బాబు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవత్తే రమణ

మహిళా రైతులను ప్రోత్సహించడమే ధ్యేయం

ప్రజాశక్తి - పెనుగొండ రూరల్

మహిళా రైతులు వ్యవసాయంలో యాంత్రీకరణ, అనుబంధ ఉత్పత్తుల ద్వారా ఆదాయం పెంచడమే ముఖ్యోద్దేశమని ప్రిన్సిపల్ సైంటిస్ట్ రమణ తెలిపారు. ఐఎఫ్‌సి క్లస్టర్ సమావేశంలో పాల్గొన్న పలువురు వ్యక్తలు మాట్లాడుతూ పంటల సస్యరక్షణకు సూచించిన మేరకు మాత్రమే పురుగుమందులు వాడాలన్నారు. వ్యవసాయంలో మహిళా రైతులను ప్రోత్సహించి, ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రతి 100 కుటుంబాలకూ సిఆర్‌పిలను నియమించి వారి అభీష్టం మేరకు వ్యవసాయంతో పాటు కోళ్ల పెంపకం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ తదితర వాటిపై లేటెస్ట్ టెక్నాలజీని అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ బడేటి బ్రహ్మాజీ, ఎంపిటిసి కృష్ణకాంత్, వాటర్ డిస్ట్రిబ్యూటర్ మెంబర్ సుబ్బరాజు, బిజెపి గ్రామ అధ్యక్షుడు గంద్రోతు నాగేశ్వరరావు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర



వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్లు

వృద్ధాప్యంలో ఉన్న పెన్షనర్ల ఆర్థిక పరమైన, వైద్య పరమైన సమస్యలను మానవతా దృక్పథంతో సత్వరం పరిష్కరించాలని పెన్షనర్స్ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కొత్త సత్యనారాయణ మూర్తి, పాలా ప్రసాద్ కోరారు. బుధవారం మార్టేరులోని రోటరీ క్లబ్ వద్ద మండలం లోని ఉద్యోగ ప్రభుత్వ పెన్షనర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం సబ్ ట్రెజరీ అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నూతన కార్యవర్గ సభ్యులు జి.కేశవ రెడ్డి, ఎస్.నందన్‌కుమార్, కె.వెంకటలక్ష్మి, టి.సత్యనారాయణ, పి.నర్సిరెడ్డి, బి.సత్తిపండు, పి.నాగిరెడ్డి పాల్గొన్నారు.


సర్పంచులకు ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి - నరసాపురం

మండల పరిషత్ కార్యాలయంలో గత రెండు రోజులుగా సర్పంచులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. చివరి రోజున గ్రామ అభివృద్ధి, పాలను నిర్వహణ, మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం, స్వచ్ఛభారత్ తదితర అంశాలపై ఎంపిడిఒ వీరభద్రరావు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సోని, ఇఒపిఆర్‌డి నాగేంద్రకుమార్, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

విద్యార్థులు యాప్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - మొగల్తూరు




షెడ్యూల్ ఆవిష్కరిస్తున్న స్టేట్ సెక్రెటరీ డైరెక్టర్ కృష్ణారెడ్డి

ఎన్ఎంఎంఎస్‌కు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వ ఉపాధ్యాయులచే నిర్వహించే ఉచిత మొబైల్ యాప్‌ను బుధవారం అమరావతిలోని విద్యా భవన్‌లో ఎపి సెక్రటరీ డైరెక్టర్ ఎంవి.కృష్ణారెడ్డి గారిచే తెలుగు ఎగ్జామ్స్ యాప్ సేవల షెడ్యూల్‌ను ఆవిష్కరించారని సెక్రటరీ ఫ్యాకల్టీ దేవరపు శ్రీనివాస్, గంగిరెడ్డి, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు వీరవల్లి వెంకటేశ్వరరావు పంపన శ్రీనివాసరావు ఆంజనేయులు, అంగాని గోపాలకృష్ణ కాటూరి రాయుడు తెలిపారు. మొబైల్ నేను ప్లే స్టోర్ ద్వారా Telugu exams యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని వినియోగించుకోవాలన్నారు. ఎన్ఎంఎస్‌లో ఎంపికైన విద్యార్థులకు నాలుగు సంవత్సరాల పాటు సంవత్సరానికి 1,2000 చొప్పున ప్రభుత్వం విద్యార్థుల ఖాతాలకు జమ చేస్తుందన్నారు. ఈ యాప్ అక్టోబర్ 11 నుండి నవంబర్ 30వ తేదీ వరకూ 50 రోజులు పార్టీ నిర్వహించి ఆన్‌లైన్ పరీక్షల షెడ్యూల్డ్ కష్ణారెడ్డి ఆవిష్కరించారని వారు తెలిపారు. విద్యార్థులు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకుని ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక కావాలని ఉపాధ్యాయులు సూచించారు.

మొగల్తూరులో వానరం హల్‌చల్

ప్రజాశక్తి - మొగల్తూరు



మండల కేంద్రంలో వానరం హల్చల్ చేసింది. గాంధీ బొమ్మ కూడలి, ప్రధాన రహదారుల పక్కన నిలిపిన వాహనాలపై కూర్చుంది. నడివెల్లే వారి వెనుకే అది కూడా వెళుతూ ఉండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. వానరం ఎవరిపై దాడికి పాల్పడలేదు. పలువురు దానికి తినుబండారాలు అందించారు. దీన్ని చూసేందుకు ప్రజలు ఆసక్తి కనపరిచారు.

ఘనంగా ఛాంబర్స్ స్వర్ణోత్సవ శోభాయాత్ర

ప్రజాశక్తి - పాలకొల్లు



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

స్థానిక ఛాంబర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కెవిఎం ఛాంబర్ జూనియర్ కళాశాల గోల్డెన్ జూబ్లీ, బిఆర్ఆర్ అండ్ జీకేఆర్ ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాల పెరల్ జూబ్లీ ఉత్సవాలు 11, 12వ తేదీల్లో కళాశాలల యాజమాన్యం నిర్వహించనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా పుర ప్రజలను విద్యార్థుల తల్లిదండ్రులను యాజమాన్య సభ్యులను ఆహ్వానం పలుకుటకు కళాశాల యాజమాన్యం సోమవారం స్వర్ణోత్సవ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం స్థానిక గాంధీ బొమ్మల సెంటర్లో కళాశాల స్వర్ణోత్సవ లోగోను పట్టణ సిఐ కె.రజిని కుమార్ చేతులమీదుగా ఆవిష్కరించారు. డిగ్రీ కళాశాల పెరల్ జూబ్లీ లోగో ఆవిష్కరణను కళాశాల చీఫ్ డోనర్స్ విశ్వనాథరాజు, కంచర్ల రాజేష్, కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహారావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. తరువాత కళాశాల విద్యార్థుల చేత గాంధీ బొమ్మల సెంటర్ నుండి యడ్ల బజారు వరకూ పలు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటుగా ఝాన్సీ లక్ష్మీబాయి, రాణి రుద్రమదేవి, మహాత్మా గాంధీజీ, రైతులు వంటి వేషధారణలతో 1500 మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కళాశాల యాజమాన్య సభ్యులు సెక్రటరీ కె.సీతారామరాజు, ట్రెజరర్ ప్రవీణ్ భాను, అడిషనల్ ఛైర్మన్ తట్టపర్తి కృష్ణమూర్తి, కళాశాల అకాడమిక్ అడ్వయిజర్స్ ఎబిఎస్ మూర్తి, నందుల సీతారామరావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కటారి నాగేంద్ర కుమార్, అడబాల వెంకటరమణ, దేవరపు లక్ష్మీనారాయణ, స్వర్ణోత్సవ సంబరాలు ప్రెస్ అండ్ మీడియా అధ్యక్షులు కొమ్ము మురళి పాల్గొన్నారు.

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

324.540 గ్రాముల బంగారం రికవరీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని సోమరాజు ఇల్లింద్రపరు గ్రామంలో ఇటీవల జరిగిన దోపిడీ కేసులో దుండగులు చోరీ చేసిన సొత్తును పోలీసులు రికవరీ చేశారు. గత నెల 16వ తేదీ రాత్రి ఓ ఇంట్లోకి ప్రవేశించి, కత్తి చూపించి చంపేస్తామని బెదిరించి, నగదుతో పాటు బంగారు నగలను దోచుకెళ్లిన ముగ్గురు దొంగలను పెనుగొండ సర్కిల్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. మొత్తం వారి నుంచి 324.540 గ్రాముల బంగారాన్ని రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. పెనుమంట్ర మండలం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఈ వివరాలను వారు వెల్లడించారు. పెనుగొండ సిఐ రాయాయుడు విజయకుమార్, ఆచంట ఎస్ఐ కట్ట వెంకటరమణ, పెనుమంట్ర ఎస్ఐ కె.స్వామి, ఎఎస్ఐ అంజిబాబును ఈ సందర్భంగా నరసాపురం సైబర్ టీం సుబ్రహ్మణ్యం, జిల్లా సైబర్ టీం భాస్కరరావు, ఎస్‌పి, డిఎస్‌పి అభినందించారు. సమర్థ వంతంగా పని చేసిన వారికి రివార్డులు ప్రకటించారు.

11న ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పెనుమంట్ర శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ శనివారం ఉదయం నుంచి మార్టేరులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష కార్యదర్శులు శిరం విశ్వనాధం, బండి ప్రసాద్, ట్రెజరర్ అమృత వాక్కుల సత్యనారాయణ తెలిపారు. పాలకొల్లులోని అమరావతి కంటి ఆసుపత్రి వారి సహకారంతో మార్టేరు రోటరీ క్లబ్ భవనంలో జరిగే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పరిసర వాసులు వినియోగించుకోవాలని వారు కోరారు. ఉచిత పరీక్షలు చేసి ఉచితంగా మందులు, కళ్ల జోళ్ళు అందజేస్తున్నట్లు తెలిపారు.

జిఎస్‌టిపై అవగాహనుండాలి

ఎంపిడిఒ చంద్రశేఖర్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రభుత్వం పేద, మధ్య తరగతి కుటుంబాల వారికి ఆర్థిక చేయూత అందించే ఉద్దేశంతో నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రిపై చేసిన పన్నుపై అందరికీ అవగాహన ఉండాలని ఎంపిడిఒ వి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలం మాధవరం జూనియర్ కళాశాల జెడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జిఎస్‌టిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన వకృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మాధవరం పిహెచ్‌సిని పరిశీలించి అక్కడ వసతులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ముప్పిడి సూర్యకుమారి, డిప్యూటీ ఎంపిడిఒ ఎం.వెంకటేష్, కార్యదర్శి బి.ఫణికుమార్, జూనియర్ కళాశాల జెడ్‌పి ఉన్నత పాఠశాల అధ్యాపకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వ్యకాస మండల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - పాలకోడేరు

వ్యవసాయ కార్మిక సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక బుధవారం జరిగింది. పాలకోడేరులో జరిగిన మండల 10వ మహాసభను పురస్కరించుకుని నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వీరవల్లి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా శేషాపు అత్రియ్య, కమ్మినేని వెంకటరమణ, కార్యదర్శిగా సిహెచ్ రామానుజ దాస్, (వాసు) సహాయ కార్యదర్శిగా బొక్క గంగాధర్‌రావు, సభ్యులుగా పాల లక్ష్మి, జంగం మనోహర్, సామేలు, ఎస్.రమేష్, నాగేశ్వరరావు, నాగముణి, తరవాలమ్మను ఎన్నికయ్యారు.